క్లుప్తంగా

నాటుసారా సరఫరా అరికట్టండి



పోలీసులకు సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య ఆదేశించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎన్ని బ్రాందీ షాపులు ఉన్నాయని ఎక్కడెక్కడ ఉన్నాయని వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధలన మేరకే బ్రాందీషాపులు నిర్వహించాలన్నారు. నాటు సారా, మద్యం అక్రమ రవాణా అరికట్టాలన్నారు. బైండోవర్‌లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ సీఐ నాగసునీత, రాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై దృష్టి



ఏఎస్పీని సన్మానిస్తున్న దిమ్మగుడి గ్రామస్తులు

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గ్రామాల్లో రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాత రౌడీషీటర్లు, ఫ్యాక్షనిస్టులపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని ఉపేక్షించేదిలేదన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈ సందర్భంగా 30 ఏళ్ల తర్వాత మొహర్రం వేడుకలు నిర్వహించడానికి కృషి చేసి ఏఎస్పీని దిమ్మగుడి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోతులయ్య ఆలయ నిర్మాణానికి విరాళం



జంబులదిన్నె గ్రామస్తులకు రూ.65 వేలు అందజేస్తున్న నారాయణరెడ్డి

గార్లదిన్నె: మండలంలోని జంబులదిన్నెలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పోతులయ్య ఆలయ నిర్మాణానికి అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి రూ.65 వేలు ఆర్థికసాయం అందించారు. శనివారం నారాయణరెడ్డి మండల కేంద్రంలోని తన నివాసంలో జంబులదిన్నె గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో జంబులదిన్నె గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కేసు



కల్లూరులో అధిక సంఖ్యలో విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని పాఠశాలకు తరలిస్తున్న డ్రైవర్‌తో మాట్లాడుతున్న పోలీసులు

గార్లదిన్నె: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. శనివారం మండంలోని కల్లూరులో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలకు తరలిస్తున్న ఆటోలను ఆపి రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి ,సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆటోలు, జీపులు, బొలెరో, ఐచర్‌వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా పట్టుబడితే తొలిసారిగా రూ.1000 జరిమానా విధిస్తామని, రెండోవిడత పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టి హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్‌ఐలు అమానుల్లా, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితమంతా మోసాలే

• మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి/గార్లదిన్నె/యాడికి/నార్పల/పెద్దపప్పూరు: సీఎం చంద్రబాబు జీవితమంతా అబద్ధాలు, మోసాలేనని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి విమర్శించారు. గుత్తిలోని కేఎం ఫంక్షన్ హాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చాక కనీసం మూడు హామీలను కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. అసలు తల్లికి వందనం ఎంత మందికి వచ్చిందో, గ్యాస్ ఎంత మందికి వచ్చిందో తెలియదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రజలకు, రైతులకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, అరెస్టులు చేయిస్తూ పాలన పక్కదారి పట్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. మద్యం ఏరులై పారుతోందదన్నారు. చంద్రబాబు సాధించింది మద్యం దుకాణాలు, బెల్టు షాపులు పెంచడమేనన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రుల అవినీతి, అక్రమాలకు చంద్రబాబు బాసటగా నిలుస్తున్నారని ఘాటుగా విమర్శించారు. జమిలి ఎన్నికలు వచ్చే అవకాశముందని అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సారి వైఎస్ జగన్‌ను, వైఎస్సార్ సీపీని ఎదుర్కోవడం ఏ పార్టీకి సాధ్యం కాదన్నారు. మూడు పార్టీలు కాదు కదా ముప్పై పార్టీలు వచ్చినా జగన్ విజయాన్ని ఆపలేరన్నారు. అనంతరం ఎంపీపీ విశాలాక్షి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్ కుమార్ యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, జిల్లా నాయకుడు కె.ఎం.రంగనాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం మండల కన్వీనర్ గంగరాజు టీం సభ్యులు మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, నైరుతిరెడ్డి, ఎంపీపీ విశాలాక్షి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ , వరలక్ష్మి తదితరులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గురు ప్రసాద్ యాదవ్, సుభాష్‌రెడ్డి, శామ్యూల్, జిల్లా, మండల నాయకులు వెల్డింగ్ రవూఫ్, రామ సుబ్బారెడ్డి, తోళ్ల షాపు హరి, రమేష్‌రెడ్డి, పవన్, పట్టణ మహిళా అధ్యక్షురాలు హేమలత, డాక్టర్ శాంతి ప్రియ, మాజీ అధ్యక్షురాలు శ్రీదేవి, వెంకట లక్ష్మి, జయలక్ష్మి, నారాయణమ్మ, హరినాథ్ రెడ్డి, జీపు హరి,రామరంగారెడ్డి, ఇబ్రహీం, పులెప్ప, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు, వివిధ విభాగాల కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



గుత్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

▸▸ గార్లదిన్నె మండలంలోని యర్రగుంట్ల,ముకుందాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్‌చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లారెడ్డి యర్రగుంట్ల సర్పంచు శాంతప్ప, ఎంపీపీ వెంకటనారాయణ, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, శింగనమల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, నాయకులు బుష్రీశ్వర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

▸▸ **యాడికి:** మండలంలోని భోగాలకట్ట గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, తూట్రాళ్లపల్లిలో వైఎస్సార్‌సీపీమండల కన్వీనర్ సంజీవరాయుడు ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల నాయకులు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంత రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామాంజుల రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రామలక్ష్మి రెడ్డి, కంబగిరి రెడ్డి, రంగస్వామి, శ్రీనివాస రెడ్డి, గురప్ప, నారాయణ, వెంకటేస్, తిరుమల, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

▸▸ నార్పల మండలంలోని మంగపట్నం,హెచ్.సోదనపల్లి,గుంజేపల్లి,నలపరెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ,రీకాలింగ్ కార్యక్రమంలోవైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి(అనంతపురం పార్లమెంట్) నార్పల సత్యానారాయణరెడ్డి పాల్గొని ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, ఎంపీటీసీ కాటమయ్య, సర్పంచులు పరమేశ్వర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, పెద్దిరెడ్డి, లక్ష్మిరెడ్డి, రామలింగారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగారెడ్డి, బయపరెడ్డి, నరసింహరెడ్డి,పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

▸▸ పెద్దపప్పూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకుడు హాజీవలి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, భాగ్యరెడ్డి, రఫీ,మల్లయ్య, ఆవులసురేష్, వలి, రంగా, గిరి, బద్దీన్, మహేష్, మసూద్‌వలి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



యాడికి మండలం బోగాలకట్టలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వెంకటరామిరెడ్డి



నార్పల మండలం మంగపట్నంలో చంద్రబాబు మోసాను వివరిస్తున్న సత్యనారాయణరెడ్డి



పెద్దపప్పూరులో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు



గుత్తి మండలం తొండపాడులో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వర్లు



తాడిపత్రి మండలం ఆలూరులో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

గుత్తి రూరల్/గార్లదిన్నె/తాడిపత్రి టౌన్/పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గుత్తి మండలంలోని తొండపాడులో సిబ్బందితో కలిసి సీఐ శనివారం డ్రోన్ కెమెరాతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, రౌడీషీటర్ల గృహాలను తనిఖీ చేశారు. గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఓ ఇంటిపై దాడి చేసి 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ గ్రామ సభ నిర్వహించి ప్రజలకు సూచనలు ఇచ్చారు. చిన్న విషయాలకు ఘర్షణలకు పాల్పడి గ్రామాల్లో అల్లర్లు సృష్టించి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. ఘర్షణలకు కారణమైన వారిపై రౌడీషీట్ తెరచి గ్రామ బహిష్కరణ చేస్తామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు, నాటుసారా, అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు హనుమంతు, నీలకంఠరెడ్డి, కానిస్టేబుల్ భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

▸▸ గార్లదిన్నె మండలంలోని ఇల్లూరులో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లు పోలీసులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో గార్లదిన్నె, నార్పల, శింగనమల ఎస్‌ఐలు గౌస్ మహమ్మద్ బాషా, సాగర్, విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ తాడిపత్రి మండలంలోని ఆలూరులో శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరు వర్గాల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇరువర్గాలతో సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు కార్యక్రమంలో సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ పెద్దవడుగూరు మండలంలోని అప్పేచర్ల గ్రామంలో శనివారం పోలీసులు నాకాబంధీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరు పార్టీల నాయకుల ఇళ్లు, కళ్లాల్లోనూ తనిఖీ చేశారు. ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు అమృతం

యాడికి/పామిడి/పెద్దవడుగూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని తాడిపత్రి సీడీపీఓ సాజిదా బేగం అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా యాడికి మండలంలోని రాయలచెరువు నంబర్ 2 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్ భేగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అలాగే మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీపీసీ పల్లవి, ఏఎన్‌ఎం లక్ష్మిదేవి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• పామిడి పట్టణంలోని మంజుటాకీస్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో గుత్తి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈ రామలక్ష్మి మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంట వ్యవధిలోనే తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయంతి, షేకున్‌బీ, హెల్పర్ కీర్తి, ఆశావర్కర్ కే సువర్ణ, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

• పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసబాబు సిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లు సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్..

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన కోడిగుడ్లను సరఫరా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఎంఈఓ మస్తాన్‌రావు ఆదేశించారు. ×గుడ్డు..వెరీ బ్యాడ్× శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. డీఈఓ ఆదేశాల మేరకు శనివారం ఉదయం ఆర్పీ మున్సిపల్ హైస్కూల్‌లో ఎంఈఓ మస్తాన్‌రావు విచారణ చేపట్టారు. స్కూల్‌కు రెండు రోజుల క్రితం సరఫరా అయిన కోడిగుడ్లను పరిశీలించారు. చెడిపోయిన గుడ్లను సంబంధిత కాంట్రాక్టర్‌కే అందజేసి వాటిస్థానంలో నాణ్యమైన గుడ్లను తెప్పించుకోవాలని హెచ్‌ఎం రవిబాబు, ఏజెన్సీ నిర్వాహకులకు ఎంఈఓ సూచించారు. నివేదికను డీఈఓకు పంపుతానని ఎంఈఓ తెలిపారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



మృతదేహాన్ని శ్మశానానికి తరలిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో శనివారం లక్ష్మీనారాయణ(74) అనే వృద్ధుడు మృతి చెందంతో మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు చేసి ఆదర్శంగా నిలిచారు. వివరాలు.. తాడిపత్రి మండలంలోని చిన్నపొలమడ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఏడాదిగా వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. 10 రోజుల నుంచి అశ్వస్థతకు గురై శనివారం ఉదయం మృతిచెందాడు. ఆయన మరణవార్త తెలిసినా కుటుంబ సభ్యులు ఎవ్వరూ రాలేదు. ఆశ్రమ నిర్వాహకుడు బత్తుల ప్రసాద్ ద్వారా సమాచారం అందుకున్న యాడికి మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు ధృవనారాయణతో పాటు మరో ఐదుగురు వచ్చి మృతదేహాన్ని శ్మశానానికి తరలించి అంత్యక్రియలు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని కుంటలో మహేంద్ర అనే వ్యక్తి కొంత కాలంగా మద్యం అమ్ముతుండటంతో అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

న్యాయసేవలపై అవగాహన



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్

తాడిపత్రి రూరల్: ప్రజలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్ తెలిపారు.. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాగృతి ద్వారా ప్రజల్లోకి న్యాయ సేవలపై అవగాహన కల్పించనున్నామన్నారు. అధికారులు, ప్యారా వలంటీర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోమశేఖర్, తాడిపత్రి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలు బాలికలకు వరం

గుంతకల్లు రూరల్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు బాలికలకు ఓ వరమని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక దోనిముక్కల రోడ్డులోని కేజీబీవీని సందర్శించారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, బడి మానేసిన పిల్లలు సత్వతోముఖాభివృద్ధి సాధించడానికి కేజీబీవీలు దోహదపడుతున్నాయన్నారు. అనంతరం ఆయన విదార్థినులతో కలసి మధ్యాహ్న భోజనం తిన్నారు.

ఎస్‌కేపీ కాలేజీలో 5న జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి)లో జరుగనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జయరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య సూచించారు. శనివారం జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. 10 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 44 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు 'హెచ్‌టీటీపీ.నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ గోపీనాయక్, డాక్టర్ బాలకృష్ణ, జాకీర్‌హుసేన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కనంపల్లి, తిమ్మంపేట, తలగాచిపల్లి గ్రామాల్లో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచు హాజరై జయప్రదం చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ' రక్షా బంధన్'

గుత్తి: పట్టణంలోని కేఎం ఫంక్షన్ హాల్లో శనివారం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షా బంధన్(రాఖీ పండుగ) నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డితో పాటు జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులకు బ్రహ్మకుమారీలు రక్షా బంధన్ కట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, వైస్ చైర్ పర్సన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ రాయల్ సినిమా థియేటర్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, గుత్తి మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్ , పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు తదితరులు పింగళి వెంకయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శింగనమల: శింగనమల మరువకొమ్మ క్రాస్‌లో రుష్యశృంగ మహాముని, శ్రీరంగరాయుల విగ్రహ ప్రతిష్ఠ నిర్మాణం కోసం చేస్తున్న ప్రదేశంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటు, అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు.

'నాణ్యమైన భోజనం అందించండి'

పామిడి: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ సూచించారు. శనివారం స్థానిక మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, అనంతపురం సమీపంలోని సెంట్రల్ యూనివర్సిటీలోనూ ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోకపోవడం వల్ల ఫుడ్ పాయిజన్ అవుతోందన్నారు. దీంతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల యూపీ, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ కేసులు ఏపీలో పునరావృత్తం కాకుండా కూటమి ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమణ, భాస్కర్, గోపి, మణికంత, చంటి, రామాంజనేయులు, ధరణికుమార్ పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని శివాలయం, రజక కల్యాణ మండపం వద్ద ఆరుగురు మట్కా బీటర్‌లను ఎస్‌ఐ గౌస్‌బాషా అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,71600 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో దూదేకుల సిద్దిబాషా, పెద్దిని నబీరసూల్, షేక్ షెక్షావలి, మునపరి మనికంఠ, మిఠాయి ఘర్ ఫరుఖ్‌భాషా, షేక్ షేక్షావలి ఉన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికిలో ఒకరు..

యాడికి: మండల కేంద్రంలో మట్కా రాస్తున్న బీటర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. గత కొంతకాలంగా మండల కేంద్రానికి చెందిన ఖాదర్‌బాషా మట్కా రాస్తుండటంతో శనివారం అందిన సమాచారంతో నిందితుడిని పట్టుకున్నారు. అతని నుంచి రూ.5 వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

4,5న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

శింగనమల: మండల కేంద్రంలో ఈ నెల 4, 5న ఎస్‌ఎఫ్‌ఐ 33వ జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ హాజరవుతారన్నారు. విద్యార్థులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహాసభలు విజయవంతం చేయండి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించనున్న 16వ సీపీఐ మహా సభలను విజయవంతం చేయాలని నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలను పురస్కరించుకుని పట్టణ పోలీసు స్టేషన్ సర్కిల్ నుంచి మోటర్‌సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు.

సంక్షిప్త సమాచారం

మెక్స్ట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



భానురేఖ

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన వద్ది భానురేఖ మెక్స్ట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. తెలంగాణ జైశంకర్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన ఆమె ఇంక్రిశాట్‌లో అగ్రికల్చర్ (ఎంటమాలజీ) ఇంటర్‌షిప్ పూర్తి చేసి మెక్స్ట్ స్కాలర్‌షిప్ సాధించి జాపాన్‌లోని ఒకాడియో యూనివర్సిటీలో మాస్టర్ సైన్స్ సీటు సాధించారు. ఈ సందర్భంగా ఆమెను తల్లిదండ్రులు వద్ది మోహన్, జోత్స్న, స్నేహితులు అభినందించారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుంతకల్లు రూరల్: మండలంలోని వైటీ చెరువు గ్రామానికి చెందిన రైతు కొత్తింటి చంద్ర (42) శనివారం పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. ఆయన ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. మరో 8 ఎకరాలు కౌలుకు కందిపంటను సాగు చేశాడు. ఈ క్రమంలో ఉదయాన్నే మొక్కజొన్న పొలానికి వెళ్లిన చంద్రను కట్లపాము కాటువేసింది. వెంటనే పామును చంపేసి, అక్కడి నుంచి నేరుగా గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామం సమీపంలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై గత నెల 28న టిప్పర్ ఢీకొని ఐస్‌క్రీమ్ బండి దారుడు సాలన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం అనంతపురం ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. కాగా మృతుడు పామిడి మండల మాముడూరు గ్రామానికి చెందిన వ్యక్తి.